సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 21 । ఏప్రిల్ । 2025



నూకాలమ్మ తల్లికి భూరి విరాళం

మలికిపురం: గూడపల్లి నూకాలమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి కల్లూరి మహేశ్వరి దంపతులు రూ.2.5 లక్షల విరాళం సమర్పించారు.




ముందున్నది బంగారు భవిత

పరీక్షా ఫలితాలు విడుదల కానున్న వేళ.. టెన్త్ విద్యార్థులు అనవసర ఒత్తిళ్లతో ప్రాణాలు బలి తీసుకోవద్దని, బంగారు భవితకు బాటలు వేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

8లో

సాగుకు 4,900 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 4,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 900, మధ్య డెల్టాకు వెయ్యి, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.25 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

23న పదో తరగతి ఫలితాలు

అమలాపురం రూరల్: ఈనెల 23వ తేదీ బుధవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు విడుదల కానున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలు లీప్ యాప్‌లో పాఠశాలల వారీగా కూడా విడుదల చేస్తున్నట్టు ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన 'శివ సాయి హర్ష'



రాజోలు: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కాట్రేనిపాడు గ్రామానికి చెందిన పైడిపర్తి శివ సాయి హర్ష 47వ ర్యాంక్ సాధించాడు. తండ్రి పైడిపర్తి వీర వెంకట సత్యనారాయణమూర్తి (చిన్ని) టీచర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తల్లి లక్ష్మీకళ గృహిణి. తమ కుమారుడు జాతీయ స్థాయిలో 47వ ర్యాంక్ సాధించడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు.

24 నుండి అటల్ సమ్మర్ బూట్ క్యాంప్


డీఈవో బాషా

అమలాపురం రూరల్: ఈ నెల 24వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అటల్ సమ్మర్ బూట్ క్యాంప్ – 2025 నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖధికారి షేక్ సలీం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేరూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో శాస్త్రీయత, కృషి ఆధారిత బోధన వైపు మరొక ముందడుగు వేసేలా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆదివారం డీఈవో, హబ్ స్కూల్ కోఆర్డినేటర్ పద్మావతి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లాలోని 45 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను మరింత మెరుగుపరిచి, వచ్చే విద్యా సంవత్సరానికి సిద్ధం చేయడమేకాక, విద్యార్థులలో సృజ నాత్మకతను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, హెచ్ఎం కడలి శ్రీనివాస్ పర్యవేక్షణలో వీటిని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ శిబిరంలో జిల్లా నలుమూలల నుంచి ఎంపికైన ఒక హబ్ పాఠశాల, ఐదు స్పోక్ పాఠశాలల ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తారని, ప్రతి స్పోక్ స్కూల్ నుంచి ఒక ఉపాధ్యాయుడు, ఐదుగురు విద్యార్థులు, హబ్ స్కూల్ నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు, పది మంది విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొంటారన్నారు. ఈ శిక్షణలో భాగంగా ప్రయోగశాలలో ఉన్న కాంపోనెంట్ల ఉపయోగం, వివిధ రకాల అటల్ ప్రాజెక్టుల రూపకల్పన విద్యార్థులకు ఆవిష్కరణాత్మక ఆలోచనల అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణకు పూనే నుంచి విజ్ఞాన ఆశ్రమం ద్వారా ఒక నోడల్ టీచర్‌ను నియమించినట్టు ఆయన తెలిపారు. భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఈ శిక్షణకు సహకరిస్తారన్నారు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్ గోదావరి భవన్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయితో పాటు డివిజన్, మండలం, మున్సిపల్ స్థాయిలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. డివిజన్ స్థాయి కార్యక్రమం జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలలో జరుగుతాయని డివిజనల్ స్థాయి అధికారులు అందరూ సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాలలో పాల్గొంటారన్నారు. మండల స్థాయి వేదిక సంబంధిత మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహిస్తారని, మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో పాటు మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా గ్రీవెన్స్‌లో పాల్గొనాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

సాయిబాబాకు రజత ఛత్రం సమర్పణ


బాబాకు రజత ఛత్రం అందజేస్తున్న వాడ్రేవు రాజరాజేశ్వరి, కుటుంబ సభ్యులు

రామచంద్రపురం: పట్టణంలోని కోదండ రామాలయంలో కొలువై ఉన్న శిరిడీ సాయిబాబా వారికి పట్టణానికే చెందిన వాడ్రేవు శ్రీరాజరాజేశ్వరి రామ్మూర్తి రూ. 2.20 లక్షల విలువైన రజత ఛత్రాన్ని సమర్పించారు. రాజరాజేశ్వరి ఇటీవల మృతి చెందిన తన అత్తగారు వాడ్రేవు సుబ్బలక్ష్మి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వాడ్రేవు సాయిప్రసాద్, రత్న పద్మావతి, వాడ్రేవు శ్రీనివాస్, భానుగాయత్రి, వాడ్రేవు వీరేశలింగం, విన్నకోట శ్రీనివాస్‌లతో కలసి ఆలయ నిర్వాహకుడు కౌన్సిలర్ అంకం శ్రీనివాస్, పాలూరి గోపాలకృష్ణకు ఛత్రాన్ని అందజేశారు.

ఉపాధి లక్ష్యం ఉపవాసమా!

- చేసిన పనులకు మంజూరు కాని బిల్లులు
- నాలుగు నెలలుగా కూలీలకు వస్తులు
- కమీషన్ల కక్కుర్తితో అనర్హులకు గోకులాలు
- గగ్గోలు పెడుతున్న కాంట్రాక్టర్లు


కపిలేశ్వరపురం మండలంలోని అంగరలో చెరువులో పూడిక తీస్తున్న కూలీలు (ఫైల్)

అలమూరు: పని లేనివారికి పని చూపించి నాలుగు డబ్బులు సంపాదించే అవకాశం కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వాలది. నిరుద్యోగితను పారదోలి ప్రతి వ్యక్తీ పనిచేయడం ద్వారా కొనుగోలు శక్తి పెరిగి రాష్ట్ర లేదా దేశ ఆర్థిక వ్యవస్థ ఆటుపోట్లు లేకుండా సాగిపోయేలా చూడాల్సిన అవసరం ప్రభుత్వ పెద్దలదే. చేసేందుకు పని లేక మూడంకె వేసి ఇంట్లో పడుకుంటే వ్యక్తికీ, వ్యవస్థకీ కూడా నష్టమే. ఈ క్రమంలో ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు పనికి ఆహార పథకం, ఉపాధి హామీ పథకం ఏదైనా సరే లక్ష్యం మాత్రం ప్రభుత్వానికి అవసరమైన పనీ జరగాలి.. అటు పని చేసిన వ్యక్తికి లబ్ధీ చేకూరాలి. పని చేయించేసుకుని మీ లబ్ధి తరవాత చూద్దాం అంటే లక్ష్యానికే విరుద్ధం. అదే జరుగుతోంది కూటమి ప్రభుత్వంలో. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అని పేరైతే గొప్పగా ఉంది కానీ ఉపాధిలోనే అర్ధ సత్యం కనిపిస్తోంది. ఎన్నికల హామీగా గొప్పలకు పోయి అది చేసేస్తాం.. ఇది చేసేస్తాం అని ప్రగల్భాలు పలికి పని చేసిన వారికి డబ్బులు ఇవ్వకపోవడం అన్నది శోచనీయం. అదికూడా ఒకటీ రెండూ కాదు ఏకంగా నాలుగు నెలల పాటు నిధులు పెండింగ్ పెట్టి పథకం లక్ష్యానికి విఘాతం కలిగిస్తోంది కూటమి ప్రభుత్వం.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, మౌలిక వసతుల ఏర్పాటుకు, కనీస సౌకర్యాల కల్పనకు అంత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామంటూ విస్తృత ప్రచారం చేసుకుంటున్న కూటమి ప్రభుత్వం ఆచరణలో చేతులెత్తేసింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా చేపట్టిన సీసీ రోడ్లు, గోకులాలకు నిధుల మంజూరులో తీవ్ర జాప్యం ఏర్పడగా ఉపాధి కూలీలకు మూడు నెలల నుంచి వేతనాలు మంజూరు కావడం లేదు. కూటమి ప్రభుత్వం కొలువు తీరిన కొత్తలో గ్రామాల్లో ఆర్భాటంగా చేపట్టిన అభివృద్ధి పనులకు కొంతమేర బిల్లులు చెల్లించి ఏదో చేసేస్తున్నట్టు ఆర్భాటం చేసినా కొనసాగింపులో మాత్రం చతికిలబడ్డారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో అనేక చోట్ల అప్పులు తెచ్చి రోడ్లను నిర్మించిన చిన్న కాంట్రాక్టర్లకు నాలుగు నెలలుగా బిల్లులు రాక గగ్గోలు పెడుతున్నారు. ఆరుగాలం కష్టించి పనిచేసిన ఉపాధి కూలీలకు వేతనాలు అందక అర్ధాకలితో అలమటిస్తున్నారు. వేతనాలను మంజూరు చేయాలని కోరుతూ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకునే నాథుడు లేడంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కూలీల రోదనను, ఆకలి కేకలను ప్రభుత్వం పట్టించుకోదా అంటూ అధికారులను నిలదీస్తున్నారు.

జిల్లాలో ఉపాధి జాబ్ కార్డులు	2,31 లక్షలు
వాడుకలో ఉన్న కార్డులు	1.59 లక్షలు
పనుల్లో పాల్గొన్న కూలీలు	5.42 లక్షలు
జిల్లాలో కూలీల పనిదినాలు	56.80 లక్షలు
వేతన బకాయిలు	రూ.18.72 కోట్లు
జిల్లాలో మంజూరైన గోకులాలు	1150
ఇప్పటి వరకూ నిర్మించినవి	880
మంజూరు చేయల్సిన నిధులు	రూ 7.11 కోట్లు
జిల్లాలో నిర్మించిన సీసీ రోడ్లు	1098 కి.మీ
కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు	63.58 కోట్లు

అలాగే అధికారంలోకి రాగనే కూటమి నేతలు ఆగమేఘాల మీద ఎన్ఆర్ఈజీఎస్, పశుసంవర్ధకశాఖ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చి అనర్హులకు, అనుయాయులకు నిర్మించిన గోకులాలు (పశువుల షెడ్లు)కు సంబంధించి ఆరు నెలలైనా బిల్లులు మంజూరు కాలేదు. బిల్లులు వెంటనే వస్తాయన్న హామీతోనే గోకులాలు పూర్తి చేశామని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది కూటమి నేతలు ఆయా గ్రామాల్లోని గోకులాల లబ్ధిదారుల వద్ద, కాంట్రాక్టర్ల వద్ద ముందుగానే కమీషన్ తీసుకోవడంతో వారు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. బిల్లులు వేగవంతంగా అందిస్తామన్న హామీతో అప్పులు చేసి మరీ పనులు చేస్తే నెలలు తరబడినా బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు కొంత మంది అధికార పార్టీ నేతలకు కూడా అడిగిందే తడవుగా కమీషన్లను కూడా ముట్టచెప్పామని ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడిని తీసుకువచ్చి వేగంగా నిధులు తీసుకురావలసిన కూటమి ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం నిర్లిప్తంగా వ్యవహరించడం కష్టజీవులకు శాపంగా పరిణమించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాల్లో 385 గ్రామాల్లో 2,31,116 జాబ్ కార్డులు ఉండగా అందులో 1.59 లక్షలు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ 5.42 లక్షల మంది కూలీలు ప్రభుత్వం మంజూరు చేసిన 2385 పనులకు సంబంధించి 56,80.201 రోజులు పనిచేశారు. వీరందరికీ 2025 మార్చి 31 నాటికి ఎన్ఆర్ఈజీఎస్ విభాగం ద్వారా కూలీలకు రూ.18.72 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

ప్రకటనలకే పరిమితం

పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేసేందుకు ఉపాధి పథకం దోహదపడు తుందంటూ రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న తీరుకు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు తీవ్ర వ్యత్యాసం కనబడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు పది నెలలు పూర్తవుతున్నా సక్రమంగా చెల్లింపులు లేక గ్రామాల్లోని అభివృద్ధి ఎండమావిగా మారింది. ఉపాధి హామీ ద్వారా నిర్ణీత సమయానికి ఇప్పటి వరకూ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం, రైతులకు రాయితీలను అందించకపోవడం, ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లింపులపై దృష్టి సారించకపోవడంపై అంతటా అసహనం వ్యక్తమవుతోంది. అలాగే ఎన్ఆర్జీఈఎస్ ద్వారా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు బిల్లులు రాక అభివృద్ధి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. జిల్లాలోని అనేక గ్రామాల్లో అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలిపోవడం ఈ పరిస్థితికి అద్దంపడుతోంది. జిల్లాలోని ఒక్కొక్క ఉపాధి కూలీ ఖాతాలో రూ.వేలల్లో వేతనాల జమ కావలసి ఉన్నా ఇప్పటి వరకూ పైసా కూడా ప్రభుత్వం మంజూరు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నెలాఖరులోగా బిల్లులు చెల్లిస్తాం



ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఈ నెలాఖరులోగా బిల్లులు చెల్లిస్తాం. ఉపాధి కూలీల పెండింగ్ వేతనాల మంజూరుకు అన్ని చర్యలు చేపట్టాం. ఈనెల 25 లోపు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమచేస్తాం. పల్లె పండగలో నిర్మించిన నిర్మాణాలకు సంబంధించి బిల్లుల చెల్లింపు ప్రాసెస్‌లో ఉంది.

– ఎస్.మధుసూదన్, జిల్లా డ్వామా పీడీ, అమలాపురం


ర్యాలిలో నిధుల లేమితో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలు


అలమూరులో ఉపాధి నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు

కల్యాణోత్సవాల దిశగా అడుగులు

అన్నవరం: వచ్చే నెల 7 నుంచి 13వ తేదీ వరకూ జరగనున్న సత్యదేవుని వార్షిక కల్యాణ మహోత్సవాల ఏర్పాట్లు క్రమంగా జోరందుకుంటున్నాయి. ఇప్పటికే ఆలయానికి రంగులు వేసే పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నెల 23న దేవస్థానం, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో చర్చించాల్సిన అంశాలపై దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు, ఇతర అధికారులు ఆదివారం సమావేశమై చర్చించారు. కల్యాణోత్సవాలను విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఇదిలా ఉండగా సత్యదేవుని కల్యాణోత్సవాలకు రావాడ చిరంజీవి దంపతులు (విజయవాడ) రూ.3.5 లక్షల విలువ చేసే పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే, స్వామివారి కల్యాణంలో ఉపయోగించేందుకు వి.రాము (జంగారెడ్డిగూడెం) గోటి తలంబ్రాలు సమర్పించారు. పట్టువస్త్రాలు, తలంబ్రాలను చైర్మన్ రోహిత్, ఈఓ సుబ్బారావు దాతల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, యనమంద్ర శర్మ, ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి, ఏఈఓ కొండలరావు, సూపరింటెండెంట్లు అనకాపల్లి ప్రసాద్, సుబ్రహ్మణ్యం, అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.


దాత సమర్పించిన పట్టు వస్త్రాలను చూపుతున్న చైర్మన్, ఈఓ తదితరులు

వైదిక కార్యక్రమాల నిలిపివేత

కల్యాణ మహోత్సవాల సందర్భంగా వచ్చే నెల 7 నుంచి 13వ తేదీ వరకూ సత్యదేవుని సన్నిధిలో నిత్యం నిర్వహించే పలు వైదిక కార్యక్రమాలను నిలిపివేయనున్నారు. నిత్య కల్యాణం, ఆయుష్య హోమం, సహస్ర దీపాలంకార సేవ, పంచ హారతుల సేవ, ప్రతి శుక్రవారం వనదుర్గ అమ్మవారికి జరిగే చండీహోమం, పౌర్ణమి నాడు జరిగే ప్రత్యంగిర హోమం, రాత్రి వేళల్లో జరిగే పవళింపు సేవ నిలుపుదల చేయనున్నారు. స్వామివారి వ్రతాలు, ఇతర కార్యక్రమాలు యథాతథంగా జరుగుతాయి.

సత్యదేవుని సన్నిధిలో భక్తుల సందడి

- స్వామివారిని దర్శించిన 40 వేల మంది
- రూ.40 లక్షల ఆదాయం

అన్నవరం: వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. అనంతరం రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సత్యదేవుని అన్న ప్రసాదాన్ని 5 వేల మంది స్వీకరించారు.

ఘనంగా రథ సేవ

ఆలయ ప్రాకారంలో సత్యదేవుని రథ సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి, టేకు రథంపై వేంచేయించారు. స్వామి, అమ్మవార్లకు పూజలు చేసిన అనంతరం పండితులు రథ సేవ ప్రారంభించారు. రథంపై ఆలయ ప్రాకారంలో మూడుసార్లు సేవ నిర్వహించారు. అనంతరం, స్వామి, అమ్మవార్లకు నీరాజనం ఇచ్చి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. నిజామాబాద్‌కు చెందిన సాయిప్రసన్న దంపతులు రూ.2,500 చెల్లించి రథ సేవలో పాల్గొన్నారు. వారికి స్వామివారి కండువా, రవికెల వస్త్రం, ప్రసాదం ఇచ్చి, స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అర్చకుడు సుధీర్, పరిచారకుడు పవన్ తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సత్యదేవుడు, అమ్మవారు సోమవారం ముత్యాల కవచాలు (ముత్తంగి సేవ) ధరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు.


ఆలయ ప్రాకారంలో సత్యదేవుని రథోత్సవం

బాలాజీకి రూ.1.74 లక్షల ఆదాయం


దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయానికి ఆదివారం భారీగా భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.1,74,499 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 3,500 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని, 1,500 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారన్నారు. లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.27,030 వచ్చిందన్నారు. నిత్య అన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.59,257 విరాళాలుగా అందించారని తెలిపారు. యలమంచిలికి చెందిన అందె వీరరాఘవులు, లక్ష్మీసుజాత దంపతులు స్వామి వారి నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.10,116 విరాళంగా అందించారు. వారికి ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

గురువులకు పరీక్షే!

- ఎట్టకేలకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల
- తీవ్ర పోటీ తప్పదని నిపుణుల అంచనా
- జిల్లాలో వివిధ విభాగాల్లో 1,241 పోస్టులు

రాయవరం: అదిగో ఇదిగో అంటూ ఊరిస్తూ వచ్చిన డీఎస్సీ (డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ)–2025 నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ ఎట్టకేలకు విడుదల చేసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ ప్రకటిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం పది నెలలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉపాధ్యాయ కొలువు సాధించాలని ఎన్నో కలలు కంటున్న అభ్యర్థులకు అదేమీ అంత ఆషామాషీ కాదంటున్నారు నిపుణులు. అందుకు కారణం ఊరించి ప్రకటించిన డీఎస్సీలో ముఖ్యంగా ఎస్‌జీటీ పోస్టులు తక్కువ కావడం.. వయో పరిమితి పెంచడంతో పోటీ తీవ్రంగా ఉండే అవకాశం ఉంది.

అభ్యర్థుల్లో ఆందోళన

ఎట్టకేలకు శనివారం రాత్రి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారు. సిలబస్‌పై కూడా స్పష్టత రావడంతో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకుని ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న అభ్యర్థుల్లో ఒక వైపు ఆనందం, మరోవైపు ఆందోళన కనిపిస్తున్నాయి. డీఎస్సీకి వయోపరిమితిని గరిష్ఠంగా 44 ఏళ్లకు పెంచారు. డీఎస్సీ ప్రకటనకు రెండు రోజుల ముందు ఈ పెంపు జరిగింది. గత డీఎస్సీలో తృటిలో ఉద్యోగావకాశం కోల్పోయిన వారికి కొంత వెసులుబాటుగా ఉంటుంది. అయితే 2018 డీఎస్సీ అనంతరం ఆరేళ్ల తర్వాత నోటిఫికేషన్ విడుదల కావడంతో కొందరికి అర్హత వయస్సు దాటిపోయే అవకాశముంది. అందువల్ల ఆరేళ్ల వయో పరిమితి (46 సంవత్సరాలకు) పెంచాలనే డిమాండ్ అటు ఉద్యోగార్థుల నుంచి, ఇటు ఉపాధ్యాయ సంఘాల నుంచి వినిపిస్తోంది. వయో పరిమితి పెంపుతో ఈసారి గట్టి పోటీ తప్పదు. దీనికి తోడు జిల్లాలో ఈ సారి భర్తీ చేసే ఎస్‌జీటీ పోస్టుల సంఖ్య కేవలం 423 ఉండడం అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తోంది.

1,241 పోస్టుల భర్తీకి చర్యలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జెడ్పీ/ఎంపీపీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ల పరిధిలో 1,241 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో ఎస్‌జీటీ పోస్టులు 423 కాగా, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 818 ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అధికంగా ఫిజికల్ ఎడ్యుకేషన్, ఆ తర్వాత సోషల్, బయాలజీ పోస్టులు ఖాళీలు అధికంగా ఉన్నాయి. మిగిలిన సబ్జెక్టులు కేవలం రెండంకెల్లో ఖాళీలున్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ విభాగంలో ఎస్‌ఏ (పీఎస్)–03, ఎస్‌ఏ (బీఎస్)–04, ఎస్‌ఏ(పీఈ)–01, ఎస్‌జీటీ పోస్టులు 104 ఖాళీలు ఉన్నాయి. ఇవి కాకుండా జోన్–2 పరిధిలో ఏపీ రెసిడెన్షియల్, ఏపీ మోడల్ స్కూల్స్, ఏపీ సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్/ట్రైబల్ (గురుకులం) యాజమాన్య పాఠశాలల్లో 348 పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో పీజీటీ–49, టీజీటీ–272, పీడీ–03, పీఈటీ–24 పోస్టులు భర్తీ చేయనున్నారు.

పోటీ అధికమే

డీఎస్సీకి పోటీ అధికంగా ఉండే అవకాశముంది. ఎస్‌జీటీ పోస్టులకు డీఎడ్ శిక్షణ పొందిన వారు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు బీఎడ్ శిక్షణ పొందిన వారు అర్హులు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు కూడా పోటీ అధికంగానే ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 35 నుంచి 40 వేల మంది పోటీ పడే అవకాశముందని భావిస్తున్నారు. 2018 డీఎస్సీలో ఒక పోస్టుకు 101 మంది పోటీ పడ్డారు. ఎస్‌జీటీ విభాగంలో ఒక్కో ఖాళీకి 101 మంది పోటీ పడగా, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఒక్కో పోస్టుకు 124 మంది పోటీ పడ్డారు. స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్ పోస్టుల్లో ఒక్కో పోస్టుకు 94 మంది పోటీ పడ్డారు. ఆ లెక్కన చూస్తే ప్రస్తుత డీఎస్సీలో కూడా పోటీ అధికంగానే ఉంటుందని పలువురు భావిస్తున్నారు.


శిక్షణ పొందిన ఉపాధ్యాయ అభ్యర్థులు (ఫైల్)

షెడ్యూల్ ఇదీ..

ఆన్‌లైన్ ద్వారా ఫీజులు చెల్లింపు/అప్లికేషన్ గడువు : ఈ నెల 20 నుంచి మే 15 వరకు
మాక్ టెస్ట్ (నమూనా పరీక్ష): మే 20
హాల్ టికెట్లు డౌన్‌లోడ్: మే 30 నుంచి
పరీక్ష తేదీలు: జూన్ 6 నుంచి జూలై 6 వరకు
ప్రాథమిక కీ విడుదల: అన్ని పరీక్షలు పూర్తయిన రెండో రోజు
అభ్యంతరాల స్వీకరణ: ప్రాథమిక కీ విడుదల అనంతరం వారం రోజులకు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఖాళీల వివరాలు ఇలా..

కేటగిరి	ప్రభుత్వ/జెడ్పీ/మున్సిపల్ స్కూల్స్
ఎస్‌జీటీ	423
ఎస్‌ఏ తెలుగు	65
ఎస్‌ఏ హిందీ	78
ఎస్‌ఏ ఇంగ్లీష్	95
ఎస్‌ఏ గణితం	64
ఎస్‌ఏ పీఎస్	71
ఎస్‌ఏ బయాలజీ	103
ఎస్‌ఏ సోషల్	132
ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	210
మొత్తం	1,241

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు పాలగుమ్మి విద్యార్థులు


టీచర్ చంద్రావతి, విద్యార్థులను సత్కరిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

అమలాపురం రూరల్: ఈఎండీపీ ప్రాజెక్టులో వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం ప్రభుత్వ జాతీయ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి ఈఎండీపీ ఎక్స్‌పోలో పాలగుమ్మి పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ పాఠశాల విద్యార్థులు వరుసగా మూడుసార్లు జిల్లా స్థాయికి ఎంపికై హ్యాట్రిక్ సాధించి, రెండోసారి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. కాలువల్లోని గుర్రపు డెక్కతో వివిధ రకాల కళాకృతులు తయారు చేయడం, వాటితో కంపోస్టు తయారు చేసి సేంద్రియ పద్ధతులతో మంచి ఫలసాయం పొందడం, పర్యావరణం కలుషితం కాకుండా ఎలా కాపాడాలో ప్రాజెక్టును తయారు చేశారు. ఈ సదర్భంగా ఆదివారం గైడ్ టీచర్ ఏబీ చంద్రావతి, విద్యార్థులు ఏఎస్ఎల్‌వీ నాగేశ్వరరావు, సీహెచ్ వెంకటరామ తేజలను సర్పంచ్ కుడిపూడి రామలక్ష్మి, ఎంపీటీసీ పాలగుమ్మి విజయ వాసు, హెచ్ఎం గుంట్రు వెంకటేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ కాట్రు మురళీ కృష్ణ మోహన్ ఉపాధ్యాయులు సత్కరించారు.

ముందున్నది బంగారు భవిత

- ఒక్క ఫలితం జీవితాన్ని నిర్దేశించదు
- ఆత్మహత్యకు పాల్పడితే ఎందరికో క్షోభ
- ఒత్తిడిని, నిరాశను దరిచేరనీయొద్దు
- చదువులో వెనకబాటు అత్యంత సహజం
- ప్రతికూల ఫలితం వస్తే తల్లిదండ్రులు అండగా నిలచి భరోసా ఇవ్వాలి
- పిల్లల్లో మానసిక స్థైర్యాన్ని నింపాలి
- 23న పదో తరగతి పరీక్షా ఫలితాలు

రాయవరం: చదువులో ఒత్తిడి.. ర్యాంకులు.. మార్కులు.. ఆత్మన్యూనత.. ఇలా కారణం ఏదైనా కావచ్చు.. నిండు నూరేళ్ల జీవితాన్ని అర్ధంతరంగా ముగించేస్తున్నారు. తాజాగా అంబాజీపేటలో ఒక బాలిక పదో తరగతి ఫలితాల్లో ఫెయిలవుతానన్న భయంతో ఆత్మహత్యకు పాల్పడింది. ఈ నెల 23న పదో తరగతి ఫలితాలు విడుదల కానున్నాయి. ఒత్తిడితో ప్రాణాలను బలి తీసుకోవద్దని, ఒత్తిడిని చంపేసి ఉజ్వల భవితకు బాటలు వేసుకోండని, ఆత్మ స్థైర్యాన్ని పెంచుకోవాలని మానసిక నిపుణులు, విద్యావేత్తలు సూచిస్తున్నారు.

జీవితంలో పాసైన వారెందరో

మనిషి జీవితంలో ఒడుదొడుకులు సహజం. కష్టం వచ్చిందని కుంగిపోతే రేపటి పనిని పూర్తి చేయలేం. ఈ విషయాన్ని పిల్లలు గుర్తించాలి.


- గోదావరి జిల్లాలకే చెందిన ఎల్లాప్రగడ సుబ్బారావు ఇంటర్ మూడుసార్లు తప్పినా ప్రపంచంలో అత్యంత గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగారు. ఎన్నో యాంటీ బయాటిక్స్‌ను కనుగొన్నారు. రక్తహీనత ఎందుకు వస్తుందో కనిపెట్టి దానికి చికిత్సా విధానాలను కనిపెట్టారు.
- చిన్నతనంలో మొద్దబ్బాయ్‌గా పిలవబడిన ఐన్‌స్టీన్ ప్రపంచ విఖ్యాత శాస్త్రవేత్త అయ్యారు.
- ప్రపంచాన్ని శాసిస్తున్న మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ విద్యార్థిగా వెనుకబడిన వారే.
- సచిన్ టెండూల్కర్ చదువులో రాణించలేక పోయినా తాను ఎంపిక చేసుకున్న క్రికెట్ రంగంలో ప్రపంచ కీర్తిని పొందాడు.
- స్వర్గీయ అక్కినేని నాగేశ్వరరావు విద్యాభ్యాసంలో వెనుకబడినా, తనకిష్టమైన నటనా రంగంలో పేరు ప్రతిష్ఠలు సంపాదించారు.
- పదిలో ఫెయిలై డాక్టర్లు అయిన వారు, ఐఏఎస్‌లు అయిన వారు ఎందరో ఉన్నారు.
- చదువుపై ఇష్టం లేకుంటే తమకు ఆసక్తి ఉన్న క్రీడలు, సంగీతం, వ్యాపారం ఇలా వారికి నచ్చిన రంగాన్ని ఎన్నుకోవాలి.

ఫలితాలు విడుదలయ్యే సమయం

ఏప్రిల్, మే నెలలు పరీక్షా ఫలితాలు విడుదలయ్యే సమయం. ఇప్పటికే ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. మరో మూడు రోజుల్లో పదో తరగతి ఫలితాలు విడుదల కానున్నాయి. అలాగే డిగ్రీ, పీజీ వంటి పలు ఉన్నత కోర్సుల ఫలితాలు విడుదలవుతాయి. ఈ ఫలితాలు కొందరికి మధురానుభూతిని..మరికొందరికి చేదు జ్ఞాపకాలను మిగల్చడం సహజం. ఇంటర్ ఫలితాల్లో కొందరు అత్యుత్తమ మార్కులు సాధిస్తే, మరికొందరు ఫలితాలు నిరాశాజనకంగా ఉన్నాయని, ఇంకొందరు పరీక్ష తప్పామని క్షణికావేశానికి లోనై కాని పనులు చేస్తున్నారు.

పదితో ప్రారంభం

పదో తరగతి నుంచే విద్యార్థులకు ఒత్తిడి ప్రారంభమవుతోంది. పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని కొందరు తల్లిదండ్రుల నుంచి ఒత్తిడి ప్రారంభమవుతుంది. ఆ తర్వాత అసలు సిసలైన పరీక్ష మొదలవుతుంది. జీవితంలో స్థిరపడడానికి అవసరమైన ఇంటర్మీడియేట్‌లో చేరతారు. ఇక్కడా అదే ఒత్తిడి. బాగా చదవాలని తల్లిదండ్రులు రూ.లక్షలు వెచ్చించి కార్పొరేట్ విద్యా సంస్థల్లో చేర్పించి ఆనక ఉత్తమ ఫలితాల కోసం పిల్లలపై ఒత్తిడి పెంచుతారు.



ప్రశాంతంగా ఆలోచించాలి

ఫలితాలు ఎలా ఉన్నా.. కాసేపు ప్రశాంతంగా ఆలోచించుకుని ఆత్మ విమర్శ చేసుకుంటే చాలని, అనవసర మైన ఆందోళనలకు ఒత్తిడికి గురై తప్పుడు దారులు వెతకరాదని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ఓటమి విజయానికి తొలి మెట్టని, నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నది వీరి సూచన. ఎందుకు ఓడిపోయాం? కారణమేమై ఉంటుంది? మరోసారి అలాంటి తప్పు జరగకుండా సరిదిద్దుకుని మళ్లీ ప్రయత్నిస్తే విజయం తప్పక వరిస్తుందని మానసిక నిపుణులు అభిప్రాయం.

విద్యార్థులకు సూచనలు

- పాస్, ఫెయిల్ అన్నవి సాధారణ విషయాలు.
- జీవితం ఎంతో విలువైనది. భవిష్యత్‌లో ఎన్నో విజయాలు సాధిస్తామన్న సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి.
- ఏ ఫలితమూ జీవితాన్ని నిర్దేశించదు.
- వ్యతిరేక ఫలితం ఎదురైతే కాసేపు ప్రశాంతంగా ఆలోచించి జరిగిన పొరపాటును గుర్తించాలి.
- ఒత్తిడి నుంచి వేగంగా బయటపడే ప్రయత్నం చేయాలి.
- జరిగిన తప్పును వీలైనంత వరకు తల్లిదండ్రులకు చెబితే 90 శాతం భారం దిగి పోయినట్లేనని గ్రహించాలి.
- వెనుకబడిన సబ్జెక్టులు లేదా పాఠ్యాంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి అవసరమైతే అధ్యాపకులు, సీనియర్ల సూచనలు, సలహాలను తీసుకోవాలి.
- తొందరపాటు నిర్ణయాల వల్ల తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఎంత క్షోభకు గురవుతారోనని ఒక్క క్షణం ఆలోచించాలి.

తల్లిదండ్రులు ఇవి గుర్తుంచుకోవాలి

- తమ పిల్లలు అనుకున్న మార్కులు సాధించలేదనో, పరీక్ష తప్పారనో వారిని మందలించొద్దు.
- ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పోల్చి అవహేళన చేయవద్దు.
- ఫలితాల సమయంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.
- ఫలితాలు ప్రతికూలంగా వస్తే వారు తీవ్ర నిరాశకు గురవుతారు. ఆ సమయంలో వారిని అక్కున చేర్చుకోవాలి. జరిగిన పొరపాటు గురించి పిల్లలతో సున్నితంగా చర్చించి, మీకు మేమున్నామన్న భరోసాను ఇవ్వగలిగితే వారికి తిరుగులేదు.

ఒత్తిడిలో ఉన్న పిల్లలను గుర్తించాలి



పరీక్షల్లో తప్పినంత మాత్రాన జీవితం ముగిసినట్లు కాదు. పరీక్ష తప్పిన విద్యార్థులు ఆత్మన్యూనతను వీడాలి. జరిగిన తప్పు పునరావృతం కాకుండా చూసుకోవాలి. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలి. డిప్రెషన్‌లో ఉన్న పిల్లలు నిద్రాహారాలకు దూరంగా ఉంటారు. ఒంటరితనాన్ని కోరుకుంటారు. అటువంటి వారి పట్ల స్నేహపూర్వకంగా మెలగుతూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలి.

– డాక్టర్ సౌమ్య పసుపులేటి, మానసిక వైద్యురాలు, ఏరియా ఆస్పత్రి, అమలాపురం

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాపిరాజు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం గ్రామ పరిధిలోని రాంబాగ్ సమీపంలో ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాశర్లపూడికి చెందిన నిమ్మకాయల వ్యాపారి బోణం బాపిరాజు (35) అక్కడికక్కడే మృతి చెందాడు. దేవస్థానంలో వ్యాపారం ముగించుకుని బైక్‌పై గ్రామ సరిహద్దుకు వచ్చేసరికి ఎదురుగా రావులపాలెం నుంచి అంతర్వేది ఆలయానికి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువు బి.వెంకటరత్నం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు తెలిపారు.

ప్రేమించి మోసగించినందుకు కేసు

ఐ.పోలవరం: ప్రేమించి పెళ్లి చేసుకొంటానని నమ్మించి ఒక యువతిని మోసం చేయడంపై పోలీసు కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని కేశనకుర్రు గ్రామానికి చెందిన ఒక యువతి, కొమరగిరి గ్రామానికి చెందిన చెయ్యేటి బాల సురేంద్ర కొంత కాలంగా ప్రేమించుకొంటున్నారు. అయితే ఆమె పెళ్లి చేసుకోవాలని బలవంతం చేయడంతో సురేంద్ర అంగీకరించకపోవడంతో నమ్మి మోసపోయానని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై ఎస్సై శ్రీనివాసరెడ్డి ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

6 కాసుల బంగారు గొలుసు చోరీ

ఉండ్రాజవరం: మండలంలో మోర్త గ్రామంలో పోతాప్రగడ సూర్యకుమారి ఇంట్లో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆరు కాసుల బంగారు గొలుసును చోరీ చేశారు. సూర్యకుమారి తెలిపిన వివరాల మేరకు శనివారం రాత్రి బెడ్‌రూమ్‌లో తలుపులు దగ్గరగా వేసుకుని పడుకున్నామని తెలిపారు. రాత్రి 2 గంటల సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించడంతో అలజడికి మెలకువ వచ్చి దొంగదొంగ అని అరవగా ఆ వ్యక్తి వెనుక గుమ్మం నుంచి పారిపోయినట్లు ఆమె తెలిపారు. తమకు అనుమానం వచ్చి తలదిండు తీసి చూడగా అక్కడ పెట్టుకున్న సుమారు ఆరు కాసుల బంగారం గొలుసు కనిపించకుండా పోయిందన్నారు. సూర్యకుమారి ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఆదిత్య ప్రతిభ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఈఈ మెయిన్స్–2025 ఫలితాల్లో రెగ్యులర్ ఇంటర్మీడియేట్ విద్యార్థులు అత్యున్నత ర్యాంకులు సాధించి ప్రతిభ చూపారని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి ఆదివారం తెలిపారు. ఆలిండియా స్థాయిలో కె.రుత్విక్ 23వ ర్యాంక్, పి.ఆదిత్య అభిషేక్ 46వ ర్యాంక్ సాధించి ప్రతిభ చాటారన్నారు. వీటితో పాటు 109, 112, 118, 135, 144, 155, 206, 212, 280, 300, 309, 342, 359, 395, 524 ర్యాంకులు వరుసగా సాధించారన్నారు. అలాగే 2 వేల లోపు 44 మంది, 5 వేల లోపు 102 మంది అత్యున్నత ర్యాంకులు సాధించి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రాంకు నిలువుదట్టంగా నిలిచాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి దీపక్‌రెడ్డి, హాస్టల్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ, ప్రిన్సిపాల్ మెయినా, కో–ఆర్డినేటర్ కె.లక్ష్మీకుమార్, అకడమిక్ డైరెక్టర్ రాఘవరెడ్డి, పి.గంగిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఐఐటీ క్యాంపస్ వైస్ ప్రిన్సిపాల్ ఫణీంద్ర అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి దీపక్‌రెడ్డి

24 నుంచి ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు

రాయవరం: కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రిలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ, ప్రత్యేక పాయింట్లు పొందగోరే ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టీఐఎస్) ప్రకారం త్వరలో ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు నిర్వహించనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ప్రభుత్వ, జిల్లా పరిషత్/మండల పరిషత్, మున్సిపల్, కార్పొరేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్లు పొందే వారు ఈ సర్టిఫికెట్లు పొందడానికి అర్హులు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉపాధ్యాయుల బదిలీ నియంత్రణ చట్టం–2025 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరీ, ప్రత్యేక పాయింట్లు పొందేందుకు అర్హత ఉన్న వారు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రిలో సంబంధిత సర్టిఫికెట్లు చూపించి నూతన మెడికల్ సర్టిఫికెట్లు పొందాల్సి ఉంటుంది. ఈ మేరకు కాకినాడ డీఈవో పి.రమేష్ మండల విద్యాశాఖ కార్యాలయాలకు ఈ మేరకు సమాచారం పంపించారు.

మల్లాంలో పరిస్థితి ప్రశాంతం

జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి

పిఠాపురం: మండలంలోని మల్లాం గ్రామంలో ఇటీవల జరిగిన సంఘటనకు సంబంధించి పరిస్థితి ప్రస్తుతం నియంత్రణలో ఉందనీ, శాంతి కమిటీ ఏర్పాటు చేసి, అన్ని వర్గాల మధ్య సయోధ్య నెలకొల్పే దిశగా, ఎలాంటి ఉద్రిక్తతలు ఏర్పడకుండా చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. మల్లాంలో ఇటీవల జరిగిన సంఘటనకు సంబంధించి పల్లపు సురేష్ బాబు (38) ఈ నెల 16వ తేదీన ఎలిసెట్టి జల్లిబాబు ఇంట్లో మరమ్మతులు చేస్తూ దురదృష్టవశాత్తు మృతి చెందారన్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన దళిత నాయకులు రూ.10 లక్షల పరిహారం డిమాండ్ చేయగా జల్లిబాబు ఆర్థికంగా బలహీనంగా ఉండటంతో స్థానిక సీఐ సమక్షంలో రూ 2.75 లక్షల పరిహారంపై పరిష్కారం కుదిరిందన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో గ్రామానికి చెందిన కొన్ని కాపు కుటుంబాలు గతంలో జరిగిన ఇటువంటి ఘటనలను గుర్తు చేసుకుంటూ వాదనలు మొదలుపెట్టారు. వీరి అసంతృప్తి కారణంగా దళిత కుటుంబాలపై సామాజిక బహిష్కరణ చర్యలు ప్రారంభమయ్యాయన్నారు. ఆదివారం ఒక దళిత కుటుంబానికి కాపు వర్గానికి చెందిన చికెన్ వ్యాపారి చికెన్ విక్రయించడాన్ని నిరాకరించారు. అంతే కాకుండా, పొలాల్లో, షాపుల్లో దళిత కుటుంబాల సేవలను నిలిపివేశారన్నారు. ఈ సంఘటనలపై గ్రామానికి చెందిన కొంతమంది యువ దళిత నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. సంఘటనపై అవగాహన కలిగి ఉన్న ఆర్డీఓ, వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను అక్కడికి పంపించామన్నారు. వీరిద్దరూ గ్రామంలోనే ఉన్నారని, తాను నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

గోదావరిలో మృతదేహం లభ్యం




మదన్ కిశోర్ (ఫైల్)

మృతుడు రాజమహేంద్రవరం వాసిగా గుర్తింపు

కొవ్వూరు: రాజమహేంద్రవరం ఆర్టీసీ కాలనీకి చెందిన సుంకర మదన్ కిశోర్ (45) అనే వ్యక్తి మృతదేహం ఆదివారం ఏరినమ్మ ఘాట్‌లో లభ్యమైనట్లు సీఐ పి.విశ్వం తెలిపారు. మృత దేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ పోలీసు స్టేషన్‌లో మృతుడి సోదరుడు పవన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వ్యక్తి అదృశ్యం కేసు నమోదు చేశామని ఎస్సై జి.సతీష్ తెలిపారు. మృతుడు ఓఎన్జీసీలో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో సోదరుడు పవన్‌కుమార్‌కి ఫోన్ చేసి తన కుమార్తె, తల్లితో మాట్లాడాలి ఇవ్వమని చెప్పి కొద్దిసేపు మాట్లాడాడని, అనంతరం నది ఒడ్డున తాళాలు పెట్టి స్నానానికి వెళ్తున్నట్టు చెప్పాడని ఫిర్యాదుల పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్నానానికి వెళ్లి నదిలో మునిగిపోయినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారని ఎస్సై సతీష్ తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	18,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

భీమేశ్వరునికి స్వర్ణ పుష్పాల సమర్పణ



భీమేశ్వరాలయ ఈఓ దుర్గా భవానికి స్వర్ణ పుష్పాలు అందజేస్తున్న దాత గంగిరెడ్డి

రామచంద్రపురం రూరల్: త్రిలింగ క్షేత్రం, పంచారామం, అష్టాదశ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామికి చెల్లూరు శ్రీ రాజరాజేశ్వరి మోడరన్ రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లు అధినేత సత్తి గంగిరెడ్డి, భాగ్యలక్ష్మి దంపతులు 21 గ్రాములు తూగే 108 బంగారు పుష్పాలను ఆదివారం సమర్పించారు. దాత గంగిరెడ్డికి ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గాంధీపురంలోని శ్రీ గౌతమి స్మార్ట్ స్కూల్‌లో అండర్ –9 బాల బాలికాల చదరంగం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో బాలురు విభాగంలో కార్తీక నాయుడు, శ్రీ సాయి విభూలు విజయం సాధించగా, బాలికల విభాగంలో శ్రీనిఖిల, ఆద్య విజయం సాధించారు. అసోసియేషన్ సభ్యులు హేమ చంద్ర, సురేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎట్టకేలకు రీస్ట్రక్చరింగ్ పూర్తి

రాయవరం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 117కు ప్రత్యామ్నాయంగా ప్రస్తుత ప్రభుత్వం తీసుకువచ్చిన పాఠశాలల రీస్ట్రక్చరింగ్ విధానం ఓ కొలిక్కి వచ్చింది. రీ స్ట్రక్చరింగ్‌లో భాగంగా 3, 4, 5 తరగతులను పూర్వపు పాఠశాలల్లోకి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. అందులో భాగంగా మోడల్ ప్రైమరీ పాఠశాలలు, బేసిక్ ప్రైమరీ పాఠశాలలు, ఫౌండేషన్ పాఠశాలలుగా విభజించారు. రెండు రోజులుగా రీస్ట్రక్చరింగ్‌పై అధికారులు, ఐటీ సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న క్యాడర్ స్ట్రెంత్, క్యాడర్ వారీగా ఖాళీల సంఖ్యను ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా కాకినాడ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారులు రీస్ట్రక్చరింగ్ ప్రక్రియను పూర్తి చేశారు.

1,567 పాఠశాలలు

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రీస్ట్రక్చరింగ్ ప్రకారం 1,567 పాఠశాలలున్నాయి. వీటిలో శాటిలైట్ స్కూల్ 01, ఫౌండేషన్ స్కూల్స్ 194, బేసిక్ ప్రైమరీ పాఠశాలలు 891 (1–5 తరగతులు), మోడల్ ప్రైమరీ పాఠశాలలు 190 (1–5 తరగతులు, ఒక్కో తరగతికి ఒక్కో ఉపాధ్యాయుడు), ఉన్నత పాఠశాలలు 190, బేసిక్ ప్రైమరీతో కూడిన ఉన్నత పాఠశాలలు 31, ప్రాథమికోన్నత పాఠశాలలుగా 42, డౌన్‌గ్రేడ్ టు బేసిక్ ప్రైమరీ స్కూల్స్ 07, డౌన్ గ్రేడ్ టు మోడల్ ప్రైమరీ స్కూల్స్ 02, మోడల్ ప్రైమరీ స్కూల్స్‌తో కూడిన ఉన్నత పాఠశాలలు 04 (1–10 తరగతులు), అప్‌గ్రేడ్ టు హైస్కూల్ విత్ న్యూ బేసిక్ ప్రైమరీ స్కూల్స్ (1–10)– 08, అప్‌గ్రేడ్ టు హైస్కూల్ విత్ న్యూ మోడల్ ప్రైమరీ స్కూల్స్ 12గా లెక్క తేల్చారు.

దుర్గమ్మ ఆలయంలో చోరీ

- రూ.2.5 లక్షల విలువైన ఆభరణాలు చోరీ
- సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసుల విచారణ

తొండంగి: మండలంలోని పి.అగ్రహారంలో ఇటీవల పునర్నిర్మించిన దుర్గామాత ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగినట్టు ఆలయకమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. పోలీసులు, ఆలయ కమిటీ తెలిపిన వివరాల ప్రకారం పి.అగ్రహారంలో దుర్గామాత ఆలయాన్ని దాతల సహకారంతో పునర్నిర్మించారు. మార్చి 16న అమ్మవారి విగ్రహప్రతిష్ఠ జరిగింది. ఈ నేపథ్యంలో దాతల సహకారంతో అమ్మవారికి వెండి కిరీటం, మూడు జతల శతమానాలు, వెండి కాసులపేరు అలంకరించారు. శనివారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు నగల చోరీకి పాల్పడ్డారు. ఈ దృశ్యాలు ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యాయి. అయితే రెండు రోజుల ముందు పగలు అమ్మవారిని దర్శించుకుని రెక్కీ నిర్వహించినట్టు కూడా ఫుటేజీలో రికార్డు అయ్యింది. దీంతో ఆదివారం ఉదయం అమ్మవారికి పూజ చేసేందుకు వెళ్లిన పూజారికి ఆలయ తాళాలు పగలుగొట్టి కనపడ్డాయి. తరువాత అమ్మవారి నగలు చోరీకి గురయ్యాయని గుర్తించారు. నగల విలువ రూ.రెండున్నర లక్షలు ఉంటాయని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. దీంతో ఆలయకమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు కలిసి తొండంగి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసారు. ఈ మేరకు ఎస్సై జగన్మోహన్‌రావు ఘటనా స్థలాన్ని పరిశీలించి సీసీ ఫుటేజీని సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



దుర్గామాత ఆలయంలో నగలు చోరీ చేస్తున్నట్టు సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తొండంగి: గ్రామానికి చెందిన పల్లా శ్రీరాములు (59) ఈ నెల 14న పొలం నుంచి ఎడ్ల బండిపై ధాన్యం బస్తాలు తీసుకువచ్చి ఇంట్లో వేస్తుండగా అదుపుతప్పి పడిపోయాడు. దీంతో మెడపై బస్తా పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు స్థానికంగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అతడు చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. శ్రీరాములు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జగన్మోహన్‌రావు తెలిపారు. శ్రీరాములుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మబ్బులు కమ్మినా మంట మామూలే!

- ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు
- స్థిరంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు
- చిన్నపాటి గాలులకే విద్యుత్ కోతలు

సీటీఆర్ఐ: భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండడంతో ప్రజలంతా అల్లాడిపోతున్నారు. 40 డిగ్రీలు ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదవుతుండడంతో రానున్న రెండు మూడు నెలలూ ఇంకెలా ఉంటుందోనని భీతిల్లిపోతున్నారు. రోజుకూలీ పనివారు ఉదయం ఆరు నుంచే పనులు మొదలుపెట్టి మధ్యాహ్నం నాటికి పూర్తిచేసుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు. చిరు వ్యాపారులు మధ్యాహ్నం పూట వ్యాపారాలు మూసివేసి సాయంత్రం చల్లబడిన తరువాత దుకాణాలు తెరుస్తున్నారు. గత మూడు రోజులుగా మబ్బులు ఆశపెడుతున్నా అడపాదడపా ఏదో చిరు జల్లులు పడుతున్నా ఉక్కపోత మాత్రం చిన్నారులను, పెద్దలను చికాకు పెడుతోంది.


విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు...

అకాశం కొంచెం మేఘావృతమడం పాపం వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఓ మోస్తరు చినుకులకే గంటల పాటు విద్యుత్ నిలిపివేస్తుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో విద్యుత్ ఆధారిత వ్యాపారాలు చేసుకునే వారు ఆర్థికంగా నష్టపోతున్నారు. భానుడు కరుణించినా ప్రభుత్వం కనికరించడం లేదని వారు వాపోతున్నారు.

విద్యుత్ కోతలతో ఇబ్బంది

చిన్న గాలికే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఎండా కాలంలోనే ప్రభుత్వం కరెంట్ కోతలు విధిస్తే రానున్న వర్షాకాలంలో మాలాంటి చిరువ్యాపారస్తులు పరిస్థితి ఎలా ఉంటుందోనని అనిపిస్తుంది.

– మోటూరి సత్యనారాయణ మూర్తి, చిరు వ్యాపారి



మబ్బుల చాటుకు వెళ్లిన భానుడు